తొలగనున్న ట్రా‘ఫికర్‌’

ప్రారంభమైన జాతీయ రహదారి విస్తరణ పనులు

మేడ్చల్‌రూరల్‌: మేడ్చల్‌ పట్టణంలో ట్రాఫిక్‌ సమస్యలు తీరనున్నాయి. 44వ జాతీయ రహదారిని విస్తరణ పనులు చకచకా జరుగుతున్నాయి. మహానగర శివారు ప్రాంతమైన మేడ్చల్‌ రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణం కావడంతో రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. నాగ్‌పూర్‌కు వెళ్లే అతిపొడవైన జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలసంఖ్యలో భారీ, అతిభారీ వాహనాలు సరుకులతో రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల అధికార సంస్థ (ఎన్‌ఎఫ్‌ఏఐ) ఆధ్వర్యంలో విస్తరణకు పూనుకుని 2023లో పనులకు శ్రీకారం చుట్టింది.


మేడ్చల్‌ పట్టణంలో కొనసాగుతున్న ఫ్లైఓవర్‌ నిర్మాణ పనులు

విస్తరణ ఇలా..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని బోయిన్‌పల్లి చెక్‌పోస్ట్‌ నుంచి మేడ్చల్‌ మీదుగా మెదక్‌ జిల్లా కాళ్లకల్‌ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతూ.. అభివృద్ధి చేస్తున్నారు. రహదారిని 6 లైన్ల నుంచి 8 లైన్లకు విస్తరించడంతో పాటు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బ్రిడ్జీల నిర్మాణం చేపట్టారు. మేడ్చల్‌లో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు నిజామాబాద్‌, అదిలాబాద్‌, నాగ్‌పూర్‌ వెళ్లే వాహనాలు మేడ్చల్‌ పట్టణంలో ఆగకుండా నేరుగా వెళ్లేందుకు ఫ్లై ఓవర్‌ బ్రిడ్జిలు వినియోగించేలా నిర్మాణాలు చేపడుతున్నారు.

తగ్గనున్న ప్రమాదాలు..

మేడ్చల్‌ జాతీయ రహదారిపై అన్ని రకాల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో 24 గంటల పాటు కంటైనర్లు, భారీ సరుకు రవాణా వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరుకు రహదారుల కారణంగా ప్రమాదాలతో రక్తసిక్తమయ్యేవి. రహదారుల విస్తరణ ఫ్లైఓవర్‌ నిర్మాణంతో వాహనాల రద్దీ తగ్గడంతో పాటు ప్రమాదాలు నివారించే ఆస్కారం ఉంది.

రాకపోకలు సాగించే వాహనాలు సంఖ్య: 20,000
భారీ అతిభారీ వాహనాలు: 6,000 నుంచి 8,000

ఫ్లై ఓవర్‌ నిర్మాణం ఎక్కడ..?

మేడ్చల్‌ పారిశ్రామికవాడ నుంచి అత్వెల్లి వరకు 8 లైన్లకు విస్తరించడంతో పాటు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణం చేపడుతున్నారు. మేడ్చల్‌ పారిశ్రామికవాడ నుంచి అత్వెల్లి వరకు 3.2 కిలోమీటర్ల మేర 6 లైన్లతో ఫ్లై ఓవర్‌ నిర్మాణం చేపడుతున్నారు. మేడ్చల్‌లో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు నేరుగా నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, నాగపూర్‌ వాహనాలు పట్టణంలో ఆగకుండా పైవంతెన వినియోగించేలా నిర్మాణాలు చేపడుతున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేవీరెడ్డినగర్‌ వద్ద ఫ్లైఓవర్‌ ప్రారంభమై కండ్లకోయలోని ఓఆర్‌ఆర్‌ సమీపం వరకు 3కిలోమీటర్ల మేర నిర్మాణం చేపడతారు.

ప్రమాదాలు తగ్గుతాయి



“ఫ్లైఓవర్‌ నిర్మాణంతో పట్టణంలో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. నాగ్‌పూర్‌ వైపుగా వెళ్లే వాహనాలు నేరుగా వెళ్తాయి. దీంతో ట్రాఫిక్‌ తగ్గుతుంది. త్వరితగతిన పనులు పూర్తైతే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది.
– హనుమాన్‌గౌడ్‌, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌, మేడ్చల్‌

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



మేడ్చల్‌: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కాంగ్రెస్‌ నేతలు మేడ్చల్‌, ఎల్లంపేట్‌ మున్సిపాలిటీల్లో సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. మేడ్చల్‌ పట్టణంలో మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్‌ నేతలు వివిధ వార్డులలో అబ్ధిదారులకు అందజేశారు. ఎల్లంపేట్‌ పరిధిలోని లింగాపూర్‌, బర్మాజీగూడలలో పట్టాలను అందజేశారు. గ్రామకార్యదర్శులు, వార్డు ఆఫీసర్లతో కలిసి కాంగ్రెస్‌ నాయకులు పట్టాలు అందజేశారు. కాంగ్రెస్‌ నేతలు రమణారెడ్డి, సంజీవరావు, మధు, రాఘవేందర్‌గౌడ్‌, వెంకటేష్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట్‌: శామీర్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) కళాశాలలో 2025 విద్యా సంవత్సరానికి తొలి విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్‌ లలిత పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఎలక్ట్రీషన్‌, ఫిట్టర్‌, కోపా (కంప్యూటర్‌ ఆపరేటర్‌ అండ్‌ ప్రోగ్రామింగ్‌) అసిస్టెంట్‌ ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21 లోగా వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

శామీర్‌పేట్‌: మేడ్చల్‌ జిల్లా, శామీర్‌పేట్‌లోని కట్టమైసమ్మ జాతర సందర్భంగా సోమవారం మాజీమంత్రి, మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మజీద్‌పూర్‌లోని రేణుకాఎల్లమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు


వెంకటనర్సింహారెడ్డి, తహసీల్దార్‌

శామీర్‌పేట్‌: నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు మూడుచింతలపల్లి తహసీల్దార్‌ వెంకటనర్సింహారెడ్డి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో నేటి నుంచి 12 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. మూడుచింతలపల్లి మండల రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి సభలు నిర్వహిస్తామన్నారు. నేడు మూడుచింతలపల్లి, నాగిశెట్టిపల్లి, చిన్నపర్వతాపూర్‌ గ్రామాల్లో నేడు సదస్సు నిర్వహిస్తామని, తహసీల్దార్‌ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఏవైనా భూ సమస్యలు ఉన్నట్లైతే రెవెన్యూ అధికారులకు అర్జీలను అందించి సమస్యను పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రౌడీషీటర్‌కు రూ. 25 వేల జరిమానా

బైండోవర్‌ ఉత్తర్వులు పాటించని వైనం


కుండ్ల మధుగౌడ్‌

ఘట్‌కేసర్‌: బైండోవర్‌ ఉత్తర్వులను ఉల్లంఘించిన రౌడీషీటర్‌కు 2వ ఎగ్జిక్యూటివ్‌ మెజిస్ట్రేట్‌ స్థానిక తహసీల్దార్‌ సోమవారం రూ. 25 వేలు జరిమానా విధించారు. ఇన్‌స్పెక్టర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కుండ్ల మధుగౌడ్‌పై ఘట్‌కేసర్‌ పోలీస్‌స్టేషన్‌లో 7 కేసులు నమోదు కావడంతో 2010లో రౌడీషీట్‌ ఓపెన్‌ చేశారు. అనంతరం తిరిగి నేరాలు చేయడంతో అతడిపై 4 కేసులు నమోదయ్యాయి. నవంబర్‌ 16, 2024న తహసీల్దార్‌ ఎదుట హాజరుపరచగా.. ఏడాది పాటు మంచి నడవడికతో మసులుకోవాలని నిందితుడిని ఆదేశించారు. కానీ డిసెంబర్‌ 18, 2024న తిరిగి అతడిపై క్రిమినల్‌ కేసు నమోదైంది. దీంతో మెజిస్ట్రేట్‌ ఉత్తర్వులు పెడచెవిన పెట్టినందుకు సోమవారం తహసీల్దార్‌ ఎదుట హాజరుపరచగా రూ.25 వేలు జరిమానా విధించారు.

స్వచ్ఛతా ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ ప్రారంభం

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దమ్మాయిగూడలో నూతనంగా ఏర్పాటుచేసిన స్వచ్ఛతా ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ను మంగళవారం జవహర్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ సైదయ్య, ఎస్సై ఇద్రీస్‌ అలీ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం బాగుండాలని, స్వచ్ఛమైన పదార్థాలను అందజేసేందుకు చిన్నపాటి ప్రాసెసింగ్‌ యూనిట్‌ను నెలకొల్పి ముందుకురావడం అభినందనీయమన్నారు. దమ్మాయిగూడ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముప్పు రామారావు, టీపీసీసీ జనరల్‌ సెక్రటరీ సరితావెంకటేష్‌, నాయకులు సదానంద్‌, బెంజిమెన్‌ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ చీఫ్‌విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి


అమరుల కుటుంబసభ్యులను సన్మానిస్తున్న మహేందర్‌రెడ్డి, కలెక్టర్‌ గౌతమ్‌ తదితరులు

శామీర్‌పేట్‌: ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ పోట్రు, డీసీపీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డితో కలిసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మహేందర్‌ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు నేటి నుంచి 20 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. రాజీవ్‌ యువ వికాస పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేసిందని, ఎంపికైన లబ్ధిదారులకు అర్హత మేరకు రుణాలు అందించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర సాధనలో అమరులైన 4 కుటుంబసభ్యులను సన్మానించారు. మైనార్టీశాఖ నుంచి 5 మంది లబ్ధిదారులకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. తదుపరి వ్యవసాయ పంటలలో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు ఎంపిక చేసిన నాణ్యమైన విత్తనాలను 5 మంది రైతులకు చీఫ్‌ విప్‌ చేతుల మీదుగా అందజేశారు. ప్రతిభ కనబరిచిన 17 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. 2024–2025 సంవత్సరంలో పదోతరగతిలో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి, జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. డీఆర్వో హరిప్రియ, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్‌ మైనార్టీ అధికారి కాంతమ్మ, డీఈఓ విజయకుమారి, యువజన సర్వీసుల శాఖ అధికారి గోపాల్‌, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పేకాట నిందితులు

పోచారం: బహిరంగ ప్రదేశంలో పేకాడుతున్న వ్యక్తులను పోచారం ఐటీ కారిడార్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌ రాజు తెలిపిన వివరాల ప్రకారం. సోమవారం అన్నోజిగూడలోని ఎల్‌ఐజీ కాలనీ దగ్గర ఉన్న బయ్యన్నగుట్ట వద్ద కొందరు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో పేకాడుతున్నారన్న సమాచారం అందడంతో సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ శివకృష్ణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 సెల్‌ఫోన్లు, ప్లేయింగ్‌కార్డుసెట్‌ 1, రూ. 9,170 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దారి దోపిడి నిందితుల రిమాండ్‌



ఘట్‌కేసర్‌: అర్ధరాత్రి దారి దోపిడీకి పాల్పడిన దుండగులను ఘట్‌కేసర్‌లో పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం వెంకన్నకుంటకు చెందిన ఉమేష్‌ పండించిన కూరగాయలు అదే ప్రాంతానికి చెందిన దస్తగిరిబాబు (24), హెల్పర్‌ సాయిలిఖిత్‌తో కలిసి కూరగాయల లోడుతో శనివారం బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌కు బయల్దేరి, తిరిగి వస్తున్న సమయంలో దుండగులు నగదును పరారైన విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు దుండగులను గుర్తించారు. ఘట్‌కేసర్‌కు చెందిన జవహర్‌, పత్తిరాజు, బంగారు శ్రావణ్‌గా గుర్తించి వారిని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

‘కార్యదర్శి మాటలను వక్రీకరించారు’

టీజీఏఆర్‌ఐఈఏ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శారద



ఘట్‌కేసర్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి ఓ సమావేశంలో మాట్లాడిన మాటలను వక్రీకరించారని, టీజీఏఆర్‌ఐఈఏ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శారద అన్నారు. విద్యార్థులు ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో అన్న మాటలను వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలలు శుభ్రం చేసేవారిని విధుల నుంచి తొలగించలేదని, నెలకు రూ. 40వేల వేతనంతో పనిచేస్తున్నారన్నారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారికి నైపుణ్యం పెంచడానికి నూతన కోర్సులు రూపొందించారని, విద్యార్థులకు చదువుతో పాటు సైనిక శిక్షణ, యూపీఎస్సీ కోచింగ్‌ ఇస్తున్నామన్నారు. కొందరు స్వార్థపరులు గురుకుల ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

100 రోజుల ప్రత్యేక ప్రణాళికపై ర్యాలీ


ప్రణాళికా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు


ఎల్లంపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్‌ నేతలు

మేడ్చల్‌రూరల్‌: మున్సిపాలిటీల్లో 100 రోజుల ప్రత్యేక ప్రణాళికా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ప్రణాళికలో భాగంగా మున్సిపల్‌ కార్యాలయం వద్ద మున్సిపల్‌ ప్రత్యేకాధికారి యాదగిరి రావు, కమిషనర్‌ స్వామి ఆధ్వర్యంలో మున్సిపల్‌ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మున్సిపల్‌ పరిధిలోని పలు వార్డులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మేడ్చల్‌: ప్రభుత్వం పట్టణాల అభివృద్ధి కోసం చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం మేడ్చల్‌, ఎల్లంపేట్‌ మున్సిపాలిటీలలో సోమవారం ప్రారంభమైంది. మున్సిపల్‌ అధికారులు, కాంగ్రెస్‌ నేతలు కలిసి 2 మున్సిపాలిటీలలో ర్యాలీలు నిర్వహించారు. మేడ్చల్‌ పట్టణంలో మున్సిపల్‌ కార్యాలయం నుంచి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఎల్లంపేట్‌ మున్సిపల్‌ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డు వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో మున్సిపల్‌ కమిషనర్‌లు నాగిరెడ్డి, నిత్యానంద్‌, కాంగ్రెస్‌ నేతలు పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫామ్‌లు వచ్చేశాయ్‌ !

● స్కూల్‌ ప్రారంభమైన తొలిరోజే పంపిణీ చేస్తాం ● సాక్షితో మేడ్చల్‌ ఏంఈఓ శంకరయ్య


శంకరయ్య ఎంఈఓ మేడ్చల్‌

మేడ్చల్‌: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదవుతున్న విద్యార్థులకు స్కూల్‌ రీ ఓపెన్‌ అయిన మొదటిరోజే పుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేస్తామని మండల విద్యాధికారి శంకరయ్య అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ఆయన సాక్షితో మాట్లాడుతూ.. మేడ్చల్‌ మండలంలో 13 జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలు, 1 సాంఘీక సంక్షేమ శాఖ గురుకులం, 33 ప్రాథమిక పాఠశాలలు 1 ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నాయని తెలిపారు. వాటిల్లో 6,890 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో చదవుతున్నారన్నారు. 3,276 మంది విద్యార్థులు ఉన్నత పాఠశాల, 3164 మంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలోని వివిధ తరగతుల్లో చదవుతున్నారని చెప్పారు. 95 శాతం మంది విద్యార్థులకు పుస్తకాలు అందేలా సరఫరా ఉందన్నారు. పాఠశాలలో పార్ట్‌–1 పుస్తకాలు పూర్తిగా ఉన్నాయన్నారు.

◆ అర్బన్‌ మండలంలో ఉన్న పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేసేందుకు డ్రెస్సులను స్కూళ్లకు తరలించినట్లు చెప్పారు. పార్ట్‌ –2 పుస్తకాలు 6 నెలల తర్వాత సరఫరా చేస్తామని వివరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి..

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ పూర్తిచేసినట్లు తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తారన్నారు. ఈనెల 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత, అందులో కలిపిస్తున్న సౌకర్యాలు, ఉన్న వసతులు వివరిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి..

విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు ప్రచారంలో పడి కార్పొరేట్‌ మాయాజాలంలో ఇరుక్కోవద్దని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. విశాలమైన భవనాలు, అన్ని రకాల వసతులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫామ్‌లు ఉచితం వంటి ఎన్నో వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని, రిజల్ట్‌ ప్రైవేటుకు ధీటుగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని కోరారు.

దేశ సేవ చేసేందుకు యువత త్రివిధ దళాల్లో చేరాలి

ఎన్‌సీసీ గ్రూప్‌ కమాండర్‌ కల్నల్‌ కుమార్‌


కల్నల్‌ కుమార్‌కు అక్షరాభ్యాస్‌కిట్‌ను అందజేస్తున్న ఎస్‌ఎంఆర్‌ఈసీ చైర్మన్‌ నల్ల మల్లారెడ్డి

పోచారం: విద్యార్థులను సమాజసేవ, దేశభక్తి, మాతృభూమి రక్షణ దిశగా అడుగులు వేసేందుకే ఎన్‌సీసీ ఏర్పాటైందని, కల్నల్‌ ఎం.ఎస్‌.కుమార్‌ అన్నారు. సోమవారం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్‌ స్కూల్‌లో కొనసాగుతున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శారీరక, మానసిక వికాసంతో పాటు భవిష్యత్తులో త్రివిధ దళాలలో చేరి దేశసేవచేసే అవకాశం ఎన్‌సీసీ కేడెట్లకు ఉంటుందన్నారు. శిక్షణా శిబిరంలో పాల్గొన్న 750 మంది కేడెట్లకు అన్ని సదుపాయాలు కల్పించిన స్కూల్‌ సెక్రటరీ నల్ల మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌ఎమ్‌ఆర్‌ఈసీ ప్రొఫెసర్‌ టీవీఎస్‌ఎంఆర్‌ భూషణ్‌ ‘స్మార్ట్‌ సొల్యూషన్‌ ఫర్‌ రియల్‌ టైమ్‌ హీరోస్‌’ అనే అంశంపై మాట్లాడారు. ఎన్‌సీసీ కేడెట్లు ఎల్లప్పుడూ.. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విధి, విపత్తుల నిర్వహణలో వచ్చే సమస్యలను తేలికగా టెక్నాలజీని వినియోగించి అధిగమించవచ్చన్నారు. ఈ శిక్షణాశిబిరంలో ఆర్మీ ఎంపికలు, ఫైర్‌ సేఫ్టీ డ్రిల్‌, విపత్తుల నిర్వహణ విధానాలు, కృత్రిమ మేధ, డిఫెన్స్‌ టెక్నాలజీపై వివిధ రంగాలకు చెందిన ప్రొఫెసర్లు, ఎన్‌సీసీ అధికారులు తమ విజ్ఞానం, అనుభవాలను వివరించారు. అనంతరం అక్షరాభ్యాస్‌కిట్‌ను కల్నల్‌కుమార్‌కు ఎస్‌ఎంఆర్‌ఈసీ చైర్మన్‌ నల్ల మల్లారెడ్డి అందజేశారు.

నాలా కబ్జాపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్‌..


ప్రహరీని జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్‌: నాలా కబ్జాకు యత్నం అనే శీర్షికన ‘సాక్షి’ లో మే 29న కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఇరిగేషన్‌ ఏఈ పరమేష్‌ సానుకూలంగా స్పందించారు. ఘట్‌కేసర్‌–ఏదులాబాద్‌ అండర్‌ పాస్‌ రోడ్డు సమీపంలో పెట్రోల్‌బంక్‌ పక్కన నాలా కబ్జాచేయడానికి కల్వర్టుపై మట్టినింపి, గోడ నిర్మించారు. నాలా కబ్జాతో వర్షం నీరు బయటకు వెళ్లేదారి లేకపోవడంతో సమీప ఇళ్లను ముంచివేస్తాయని, నీరు రోడ్డుపై పారుతుందని సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన ఏఈ నాలాపై మట్టిని నింపి నిర్మించిన ప్రహరీని కూల్చివేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించండి


కమిషనర్‌ నిత్యానంద్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు

మేడ్చల్‌: నూతన మున్సిపాలిటీ ఎల్లంపేట్‌ మున్సిపల్‌ కమిషనర్‌ నిత్యానంద్‌ను మున్సిపల్‌ పరిధిలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్‌ నేతలు కలిశారు. ఎల్లంపేట్‌లోని మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సన్మానించారు. మున్సిపల్‌ పరిధిలో విలీనమైన గ్రామాల వారీగా సమస్యలు విన్నవించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్‌ నేతలు సుదర్శన్‌, రాజ మల్లారెడ్డి, హరత్‌ రెడ్డి, యూనుస్‌పాషా, జీవన్‌ తదితరులున్నారు.

జయజయహే తెలంగాణ.. జననీ జయ కేతనం


మేడ్చల్‌ మున్సిపల్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి


కీసర చౌరస్తాలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కలెక్టర్‌ గౌతమ్‌

మేడ్చల్‌ జోన్‌ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం వివిధ పార్టీల నేతలు, ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వరాష్ట్రం కోసం అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. – మేడ్చల్‌ జోన్‌ బృందం


పోచారం మున్సిపల్‌ ఆఫీస్‌ ఆవరణలో స్పెషల్‌ ఆఫీసర్‌ విద్యాధర్‌


పోచారంలో బీఆర్‌ఎస్‌ నేత బద్దం జగన్మోహన్‌రెడ్డి


నాగారంలో కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి


దబీల్‌పూర్‌లో కాంగ్రెస్‌ నేతలు


మేడ్చల్‌ వివేకానంద విగ్రహం వద్ద..


ఘట్‌కేసర్‌లో ముత్యాలుయాదవ్‌


అన్నోజిగూడలో మండడి సురేందర్‌రెడ్డి


దమ్మాయిగూడలో కమిషనర్‌ నాగమణి